## క్లుప్తంగా

### కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

పెనుబల్లి: కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పాలన అందుతుందని మాజీ సంభాని చంద్ర శేఖర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీయంబంజర్ టేకులపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వీయంబంజర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 9 ఏళ్ల దొరల పాలనలో ఏ ఒక్కరికి ఇళ్లు రాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు రుణమాఫీతో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి ప్రజా సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి మనోహర్ రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ కిరణ్, నాయకులు రాజబాబు, కృష్ణయ్య, కాంతయ్య, చెన్నారావు, దేవేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

### బాలికా సాధికారత సాధించాలి

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఇంటర్ కళాశాలలో శుక్రవారం బాలికా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల సూపరింటెండెంట్ కె.సరిత పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత ఆశయంతో, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్యాస్ ధరలను నియంత్రించాలి

వైరారూరల్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను వెంటనే నియంత్రించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మెరుగు రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలడగులో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రం గ్యాస్ ధరలు పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతుందన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం వంటవార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్.రెహానా, షైనా తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించేందుకు అతిథి అధ్యాపక నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను కళాశాల కార్యాలయంలో ఈ నెల 13న సాయంత్రం నాలుగు గంటల్లోగా అందజేయాలన్నారు.

### ముగ్గుల పోటీలు

వైరా: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వైరా మున్సిపాలిటీలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ కమిషనర్ అనిత ప్రారంభించారు. మెప్మా సిబ్బంది, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో పర్సా నందిని ప్రథమ, గోగుల దుర్గ ద్వితీయ, తోట రమాదేవి తృతీయ బహుమతిని, ఎస్ కృష్ణవేణి, కవితలు కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు మాదినేని సునీత, టీఎంసీ వెంకటేశ్వర్లు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం

ఏన్కూరు: మండలంలోని ఉత్తమ అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఏన్కూరు మండలం నుంచి జన్నారం-1, లచ్చగూడెం అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, ఆంధ్రావాణిలను ఉత్తమ టీచర్లగా ఎంపిక చేశారు. వీరికి ఖమ్మం జడ్జి శ్రీనివాసరావు, గైనకాలజిస్ట్ లావణ్య అవార్డులు అందించారు. వీరిని సీడీపీఓ దయామణి, సూపర్‌వైజర్లు వెంకటమ్మ, రేఖాభాయిలు సన్మానం చేసి అభినందించారు.

### వేతనాలు చెల్లింపులో జాప్యం తగదు

ఎర్రుపాలెం/కారేపల్లి/తల్లాడ: ప్రభుత్వం వేతనాల చెల్లింపులో చేస్తున్న జాప్యం తగదని యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావులు, మద్దినేని నాగేశ్వరరావు, బానోత్ మంగీలాల్, టీఎస్ యూటీఎఫ్‌జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 10వ తేదీ దాటినప్పటికీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబ పోషణ ఎలా సాధ్యపడుతుందన్నారు. తల్లాడలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ మండల సమావేశంలో నాయకులు పర్మానాయక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డుకు శంకుస్థాపన

కల్లూరురూరల్: మండలంలోని లింగాల గ్రామ పంచాయతీలో శుక్రవారం రూ. 1.10 లక్షలతో నిర్మించనున్న 110 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ దేవరపల్లి అరుణ, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్‌లు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, చెన్నూరు సొసైటీ అధ్యక్షుడు రామారావు, నాయకులు పాల్గొన్నారు.

# 'కాటన్ పార్క్' కలేనా..?

- కాటన్ పార్క్ స్థలంలో ప్రైవేట్ పరిశ్రమలు
- ఫ్యాక్టరీలతో పెరిగిన కాలుష్యం
- విషతుల్యంగా మారిన పంటపొలాలు



తల్లాడలో ప్రైవేట్ పత్తి కౌంటర్




కాటన్ పార్క్ స్థలంలో ఏర్పాటైన ప్రైవేట్ పరిశ్రమలు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో కాటన్ పార్క్ ఏర్పాటు కలగానే మిగిలింది. తెల్లబంగారం(పత్తి) అత్యధికంగా పండించే ప్రాంతంగా ఖమ్మం జిల్లా తల్లాడ పరిసర ప్రాంతానికి పేరుంది. ఇక్కడ పార్క్ నిర్మాణం కోసం రైతులు బంగారం పండించే తమ భూములను 2006లోనే పారిశ్రామిక మౌళిక వసతుల సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ)కి అప్పగించారు. దశాబ్దాలు గడిచిన కాటన్ పార్క్ ఏర్పాటు మాత్రం అడుగు ముందుకు పడలేదు. రైతులకు ఏ మాత్రం ఉపయోగపడని రసాయనిక ప్యాక్టరీ వంటివి ఏర్పాటు చేశారు. దీంతో రసాయనిక ప్యాక్టరీలకు వ్యతిరేకంగా రైతులు పోరాటం చేశారు. దీంతో అక్కడ ఏర్పాటు చేసిన విషతుల్యమైన డ్రగ్ బల్క్ ఫ్యాక్టరీని మూసి వేశారు. ఈ స్థలాన్ని ప్రైవేట్ వ్యాపారులకు జిన్నింగ్ మిల్, కోల్డ్ స్టోరేజ్‌లు, జీడీ మామిడి ఫ్యాక్టరీ ఏర్పాటుకు లీజుకిచ్చారు. కాటన్ పార్క్ ఏర్పాటైతే తమ పిల్లలకు, గ్రామస్తులకు ఉపాధి దొరుకుతుందని భావించిన వారికి తీవ్ర నిరాశ ఎదురైంది. అంతేకాకుండా విషతుల్యమైన ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడంతో కాలుష్యం పెరిగి పచ్చని పొలాలు, రైతుల ఆరోగ్యం పై ప్రభావం చూపింది.

**42 ఎకరాల భూమి సేకరణ..**

జిల్లాలో ఎక్కువగా పత్తి పండించే తల్లాడ, ఏన్కూరు, జులూరుపాడు మండలాలకు చేరువలో ఉన్న అన్నారుగూడెంలో కాటన్ పార్క్ ఏర్పాటు చేయాలనే తలంపుతో స్థల సేకరణ చేసినా అది వెనక్కి పోయింది. దానికోసం రైతుల వద్ద నుంచి ఎకరానికి ఒక లక్ష రూపాయలు ఇచ్చి 42 ఎకరాల భూమిని సేకరించారు. కాటన్ పార్క్‌తో పాటు టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీ కూడా ఏర్పాటు చేస్తామని అప్పటి కేంద్ర మంత్రి రేణుకా చౌదరి హామీ ఇవ్వటంతో రైతులంతా ముందుకు వచ్చి భూములిచ్చారు. కాని ఇక్కడ కాటన్ పార్క్, జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయలేదు. అంతే కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూముల్లో ప్రైవేట్ ఫ్యాక్టరీలు పెట్టేందుకు అనుమతి ఇచ్చింది.

2013 డిసెంబరులో అమ్మోనియా, బ్రోమైడ్, పొటాషియం బ్రోమైడ్ అనే రసాయనాలు తయారు చేసే స్పైకా కెమికల్ ఇండస్ట్రియల్ నిర్మాణం జరిగింది. అప్పటి వరకు పచ్చని పొలాలతో పాడి సంపదలతో కళ కళలాడే నాలుగు గ్రామాలు కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలు పంట పొలాల్లో కలిసి భూసారం తగ్గి, విషతుల్యంగా మారింది. దీంతో పంటలు సరిగా పండకపోవడమే కాక రైతుల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఈ విషయమై గ్రామస్తులు కాలుష్య నియంత్రణ బోర్డుకు ఫిర్యాదు చేసినా రైతులకు నిరాశే మిగిలింది. రూ.40 లక్షల వ్యయంతో 2014వ సంవత్సరంలో ఇండస్ట్రియల్ పార్క్‌లో రోడ్లు కూడా నిర్మించారు.

**ప్రైవేట్‌కు దారాదత్తం..**

అన్నారుగూడెంలో ఏర్పాటు చేస్తామని చెప్పిన కాటన్ పార్క్ కాస్త ఇప్పుడు ఇండస్ట్రియల్ పార్క్‌గా మారింది. తాము మంచి ఉద్దేశంతో భూములిస్తే ప్రైవేట్ పరిశ్రమలకు దారాదత్తం చేయటమేంటనీ ప్రశ్నిస్తున్నారు. పత్తి రైతులు దళారులకే పత్తిని అమ్ముకోవాల్సి వస్తోంది. జిన్నింగ్ మిల్ ఏర్పాటు కాక ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని విక్రయిస్తున్నారు.



టీఎస్ఐఐసీ స్థలంలో ఏర్పాటైన కెమికల్ డ్రగ్ ఫ్యాక్టరీ

ప్రైవేట్ కౌంటర్ల వద్ద పత్తి వారు అడిగిన రేటుకే ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా కాటన్ పార్క్, జిన్నింగ్ మిల్లును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### మా నోట్లో మట్టి కొట్టారు



ప్రభుత్వం కాటన్ పార్క్ పేరుతో మా వద్ద నుంచి 42 ఎకరాలు భూమిని సేకరించింది. ప్రభుత్వం చెప్పిందొకటి చేసిందొకటి. అంతే కాకుండా ప్రైవేట్ వ్యాపారులకు దారులు తెరిచి మా నోట్లో మట్టి కొట్టారు. కాటన్ పార్క్ ఏర్పాటు కాక పోవటంతో ఈ ప్రాంతంలో పడించిన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకే విక్రయించాల్సి వస్తోంది. మా వద్ద సేకరించిన భూమిలో కాటన్ పార్క్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఆపతి వెంకటరామారావు, రైతు, అన్నారుగూడెం

# 'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



వైరా: కళ్ల అద్దాలను అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి

వైరా/వైరారూరల్: కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వైరా మున్సిపల్ కౌన్సిలర్ కన్నెగంటి సునీత, సర్పంచ్ కంచర్ల మరియమ్మ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వైరా మున్సిపాలిటీ 8వ వార్డులో, గొల్లెనపాడులో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాలను వారు ప్రారంభించి మాట్లాడారు. వైరాలో శిబిరాన్ని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, కంటి వెలుగు జిల్లా క్వాలిటీ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ గౌడ్‌లు సందర్శించి పరీక్షల తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి టి.ఉదయలక్ష్మి, సీహెచ్ఓ ధనలక్ష్మి, ఎంపీటీసీ కిలారు లక్ష్మి, కంటి వైద్యుడు వుండ్రు శ్యాంబాబు, భాందవి, ఆశాలు పాల్గొన్నారు.

### నియామకం

మధిర: పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ చైర్మన్‌గా పట్టణానికి చెందిన వ్యాపారవేత్త పల్లపోతు ప్రసాదరావును నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసిద్ధిగాంచిన ఆలయ పాలకవర్గ సభ్యులుగా ధీరావత్ కోటేశ్వరరావు, బాజినేని నాగరాజు, కృష్ణకుమారి, పంతంగి శేషగిరి, మామిళ్ళపల్లి సతీష్, చలువాది కృష్ణమూర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రసాదరావు మాట్లాడుతూ.. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

**బీఎస్పీ మధిర అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా విజయ్..**

బోనకల్: బహుజన సమాజ్ పార్టీ మధిర అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన పల్లెపోగు విజయ్, అధ్యక్షుడిగా చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన దారెల్లి రమేష్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర సాహు నియామక ఉత్తర్వులు అందించారు.

### క్రిస్టియన్ల సంక్షేమానికి కృషి చేయాలి

సత్తుపల్లిటౌన్: దేశంలోని క్రిస్టియన్ల సంక్షేమం కోసం కృషి చేసే పాలన రావాలని హోప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్యూల్ జాషువా గెద్దం అన్నారు. శుక్రవారం పట్టణంలోని జరిగిన ఎన్‌సీసీ ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో లక్ష మంది క్రిష్టియన్లతో హైద్రాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ ప్రసాద్, సామేలు, సత్యానందం, విజయ్‌కుమార్, యోబు, పాల్‌రాజ్, వెంకటరత్నం, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

### జాతీయ స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

మధిర/ఎర్రుపాలెం: జాతీయ స్థాయిలో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పొందేందుకు నిర్వహించిన అర్హత పరీక్షలో ఎర్రుపాలెం నుంచి ఒకరు, మదిర నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికై య్యారు. మధిరలోని టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 8వ తరగతి చదువుతున్న సాయి గౌతమ్, దినేష్ కృష్ణ, బొడ్డుపల్లి శ్రీ భద్ర, ఎర్రుపాలెంలోని వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థి కాశిబోయిన సంతోష్ ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నారాయణ, ఇనపనూరి వెంకటేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఆయా పాఠశాల యాజమాన్యాలతో పాటు సర్పంచ్ శీలం జయలక్ష్మి, జెడ్పీటీసీ శీలం కవిత, ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, ఎస్ఎంసీ చైర్మన్ లక్కిరెడ్డి కృష్ణారెడ్డి, పీఈటీ జీవీఎస్ఎన్‌రెడ్డి, శేగిరెడ్డి కాంత్‌రెడ్డి, మల్లేశ్వరరావు అభినంధించారు.

### విద్యార్థులకు డిజిటల్ పాఠాలు

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ప్రసాద్ విద్యార్థులకు లాప్‌టాప్ ద్వారా డిజిటల్ పాఠాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విజేతలకు బహుమతులు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం ఎస్‌డీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసరావు, వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు ఎం.రామ్మోహన్ రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

చింతకాని: క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని మండల వైద్యాధికారి వెంకటేశ్వర్లు వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధి అందజేసిన న్యూట్రిషన్ కిట్లను క్షయ వ్యాధిగ్రస్తులకు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సుభద్ర, జిల్లా మలేరియా అధికారి నారాయణ, పీహెచ్‌సీ సీహెచ్ఓ వీరేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, రేఛల్‌రాణి, పండరిబాయి, టీబీ సూపర్‌వైజర్ వెంకన్న, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పొంగులేటి విస్తృత పర్యటన

మధిర/ఎర్రుపాలెం: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం మధిర, ఎర్రుపాలెం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. హైకేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎష్ నాయకుడు బాహాటం శ్రీనివాసరావును పరామర్శించారు. ఇనగాలిలో ఇటీవల మృతి చెందిన యరమల సత్యనారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలు వివాహ శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, నాయకులు రాంబాబు, రంగారావు, కోటేశ్వరరావు, లక్ష్మారెడ్డి, రమేష్, తిరుమలరావు, బాలకష్ణ, ప్రశాంత్, జెడ్పీటీసీ కవిత, శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి, నాయకులు వెంకట్రామిరెడ్డి, రమణారెడ్డి, లక్కిరెడ్డి నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

### సభను విజయవంతం చేయండి

తల్లాడ: ఈ నెల 12న సత్తుపల్లిలో జరగనున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. తల్లాడలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఆత్మీయ సమ్మేళన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, నరసింహారావు, రమేష్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పంటలు ఎండిపోకుండా చూడాలి

ఏన్కూరు: రబీలో వరిసాగు ఎండిపోకుండా చూడాలని వైరా ఏడిఏ వి.బాబురావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆరికాయలపాడు వరిపంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారంబందీలో సాగర్ జలాలు ఇస్తున్నారని రైతులందరు ఐక్యమత్యంగా ఉండి కింది పొలాలకు కూడా నీరందించాలన్నారు. కొన్ని పొలాలు ఎండిపోతున్నాయని వాటికి నీరందేలా చూడాలని ఏఈఓ రంజిత్‌కుమార్‌కు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్సింహారావు, ఏఈఓ బాలకృష్ణ, రైతుబంధు కో-ఆర్డినేటర్ ప్రతాపనేని రవి, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో యువత కీలకపాత్ర

ఏన్కూరు: తెలంగాణ ఉద్యమంలో యువత కీలక పాత్ర వహించిందని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ఇందూరి సాగర్ తెలిపారు. స్థానిక ఠాగూర్ కల్యాణ మండపంలో శుక్రవారం పీవైఎల్ ఖమ్మం జిల్లా 8వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన ఎజెండాతో కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం నేడు దొరల పాలనలో బంధీ అయిందన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రమై ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. మద్యం, మత్తుపదార్థాలు, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు గొర్రెపాటి రమేష్, మందుల రాజేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ఖాసీం పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి సాగర్

# రైతాంగ సమస్యలు పట్టవా..?

**బీజేపీ ఆధ్వర్యంలో రైతుదీక్ష**



మధిర: తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



కల్లూరులో రైతు దీక్షలో బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు

మధిర/ఎర్రుపాలెం/ఏన్కూరు/కల్లూరు/పెనుబల్లి: తెలంగాణ ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టవా అని బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యులు నూతక్కి నర్సింహారావు, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి బీజేపీ మండల అధ్యక్షులు నల్లమోతుల రమేష్, గుమ్మా రామకృష్ణ, బొర్రా నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆయా మండల కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో వారు రైతుదీక్ష కార్యక్రమం నిర్వహించారు. రైతాంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్‌లో తహసీర్లకు వినతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని, పాలకులకు రైతాంగ సమస్యలు పట్టకుండా వ్యవహరించడం తగదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలన్నారు. ధరణి పోర్టల్‌లో లోపాలను వెంటనే సరిచేయాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తెలంగాణలో కూడా అమలు చేయాలని కోరారు. నాణ్యమైన ఉచిత కరెంట్‌ను నిరంతరాయంగా రైతులకు అందించి పంటలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మధిర బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి, స్వర్ణాకర్, సోమేశ్వరరావు, రామయోగేశ్వరరావు, గరిడేపల్లి వేణు, వెంకటనారాయణ, మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు చంద్రమోళేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, గోపాలరావు, రమేష్, స్వర్ణాకర్, బొల్లయ్య, ఏడుకొండలు, రామకృష్ణ, మోహన్‌రావు, అనీల్, వెంకటేశ్వర్లు, రెంటపల్లి నారాయణ, రాందాస్, బిక్షం, వెంకన్న, చెరుకుమల్లి సత్యనారాయణ, బీజేపీ ప్రధాన కార్యదర్శి గుండపనేని అనీల్, కిసాన్ మోర్చా నాయకులు కృష్ణమోహన్, శ్రీనివాస్, నరసింహారావు , మడకం శివకృష్ణ, గోవర్ధన్, చిన్ని కృష్ణ, రాము, రమేష్, ఈసూబ్ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

# పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పశువుల దాణా అందజేస్తున్న విజయ డెయిరీ డీడీ కుమారస్వామి

చింతకాని: పశువులకు సోకే వ్యాధుల విషయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని విజయ డెయిరీ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ అసోడా కుమారస్వామి సూచించారు. మండలంలోని లచ్చగూడెంలో శుక్రవారం విజయ డెయిరీ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, వైరా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటుచేయగా ఆయన మాట్లాడారు. పశువులకు సోకే వ్యాధులపై యజమానులు అవగాహన కలిగి ఉంటూ ఎప్పటికప్పుడు చికిత్స చేయించాలని తెలిపారు. అనంతరం సబ్సిడీపై పశువుల దాణా, మినరల్ మిక్చర్, కాల్షియం అందజేశారు. సర్పంచ్ గురిజాల ఝాన్సీ, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ కిషోర్‌కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ రాంజీతో పాటు గురిజాల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ద్రవ రూప యూరియాపై అవగాహన

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతిలో నానో ద్రవ రూప యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ డి.బాలాజీ మాట్లాడారు. నేరుగా వాడే యూరియా కంటే నానో ద్రవ రూప యూరియా వాడకం వల్ల యూరియా వృధా కాకుండా దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస రాజు, స్థానిక రైతు శ్రీను, రైతు బంధు అధ్యక్షుడు వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.



ద్రవ రూప యూరియా పిచికారీ చేస్తున్న రైతు

# అమరుల ఆశయాలను సాధించాలి



మాట్లాడుతున్న భాగం హేమంతరావు

చింతకాని: అమరవీరుల ఆశయాలను సాధించే దిశగా కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. మండలంలోని నాగిలిగొండలో సీపీఐ సీనియర్ నాయకుడు నారాయణ వర్ధంతి సభను పార్టీ గ్రామకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి నారాయణ చేసిన సేవలను కొనియాడారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించటమే అమరులకు మనమిచ్చే నివాళి అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో డప్పు, కోలాట నృత్యాలతో ప్రదర్శన నిర్వహించారు. నారాయణ స్మారకస్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, తోట రామాంజనేయులు, ఏపూరి రవీంద్రబాబు, మందడపు రాణి, మండల కార్యదర్శి మల్లిఖార్జున్ రావు, జిల్లా సమితి సభ్యులు యేసు, మహేష్, రవి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### చికిత్స పొందుతున్న మహిళ మృతి

కారేపల్లి: భర్త గొడవ పెట్టుకున్నాడనే క్షణికావేశంలో ఓ వివాహిత పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని గంగారం తండాకు చెందిన భూక్యా బుజ్జి(58)కి ఈనెల 9న చేను పనుల విషయమై భర్త భీముడితో గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన బుజ్జి పురుగుల మందు తాగగా ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఘటనపై మృతురాలి కుమారుడి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**సత్తుపల్లిలో రాజస్తాన్ వాసి..**

సత్తుపల్లిరూరల్: రాజస్థాన్ రాష్ట్రం భరటియా గ్రామానికి చెందిన టిక్కు మలి(24) లారీ క్లీనర్‌గా సత్తుపల్లిలోని సింగరేణి మహాలక్ష్మి క్యాంప్‌లో పని చేస్తున్నాడు. ఆయన శుక్రవారం పనిచేస్తుండగా ఛాతిలో నొప్పి వస్తోందని చెబుతూ వాంతులు చేసుకుంటుండగా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### పోలీసులకు ఫిర్యాదు

వైరా: మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు 10వ వార్డులో ఓ స్థలం విషయంలో ఇరు పక్షాలు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో గత కొన్నేళ్లుగా స్థలం విషయంలో గ్రామస్తులకు, స్థలానికి సంబంధించిన మరికొందరికి వివాదం నెలకొంది. ఈ క్రమంలో స్థలానికి చెందిన శ్రీను, మధుబాబులు తమకు కోర్టు ఆర్డర్ ఉందని చర్చికి సంబంధించిన స్థలం తమదే అంటూ ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన లక్ష్మణ్, వెంకట అబ్బులు మరికొంత మంది వారిని అడ్డుకునే క్రమంలో అక్కడే ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహ శిలా ఫలకం ధ్వంసమైంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు పక్షాలను అక్కడి నుంచి పంపించారు. ఇరు పక్షాల వారు పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

### వరి గడ్డివాములు దగ్ధం

చింతకాని: మండలంలోని మత్కేపల్లిలో ఇద్దరు రైతులకు చెందిన గడ్డి వాములు శుక్రవారం దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతులు తిరుపతి నర్సింహారావు, జగన్ ఊరి చివర గడ్డివాములు వేయగా, ఆపక్కనే చెత్తకు గ్రామపంచాయతీ కార్మికులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు గడ్డికి అంటుకుని పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయమై సమాచారం అందుకున్న ఖమ్మం అగ్నిమాపక శాఖ ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావు, సిబ్బంది సత్యనారాయణ, వెంకటాద్రి, రాజేష్, వెంకటరెడ్డి చేరుకుని మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా ఆర్పివేశారు. కాగా, పంచాయతీ కార్మికుల నిర్లక్ష్యం మూలంగా నష్టపోయిన తమకు పరిహారం చెల్లించాలని రైతులు కోరారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన ముదిగొండ మండలం వల్లబిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా గంగ్రాయి నుంచి వస్తున్న కారు, వల్లబి నుంచి గంగ్రాయి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న వెంకన్నతో పాటు మరో వ్యక్తికి గాయాలైయ్యాయి.

**బీఆర్ఎస్ నాయకుడికి..**

తల్లాడ: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కోడూరి వీరకృష్ణకు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వీరకృష్ణ బిల్లుపాడు నుంచి గొల్లగూడెం వెళ్తుండగా కల్లూరు నుంచి తల్లాడ వైపు వస్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో వీరకృష్ణకు గాయాలు కావడంతో చికిత్స నిమత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.